క్లుప్తంగా

నేడు బాబా మందిర వార్షికోత్సవం

నాదెండ్ల: చిలకలూరిపేట నూతన మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న షిర్డీసాయిబాబా మందిరం 14వ వార్షికోత్సవ వేడుకలు శనివారం నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు యూవీ శివరామయ్య, సీహెచ్ పాపారావు చెప్పారు. ఉదయం 5.15 గంటలకు బాబాకు కాగడ హారతి, 6 గంటలకు సుప్రభాత సేవ, 7 గంటలకు పంచామృతాభిషేకాలు, 8.30 గంటలకు బాబా వారి సామూహిక సాయిసత్య వ్రతాలు, 10 గంటలకు చందనోత్సవం, 12 గంటలకు మధ్యాహ్న హారతి, ఒంటి గంటకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం సంధ్యాహారతి ఉంటుందన్నారు.

నేడు నాదెండ్లలో బేటీ బచావో - బేటీ పడావో

నాదెండ్ల: స్థానిక సీడీపీవో కార్యాలయంలో శనివారం బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీడీపీవో శాంతకుమారి చెప్పారు. ఉదయం 10 గంటలకు ఐసీడీఎస్ ప్రాజెక్టులో జరిగే కార్యక్రమానికి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి హాజరుకానున్నారు. బాలలపై జరిగే అకృత్యాలు, బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, ఎంపీపీ తలతోటి రాణితో పాటూ స్థానిక నాయకులు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని కోరారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

బొల్లాపల్లి: స్థానిక మండలపరిషత్ కార్యాలయం వద్ద నేడు 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తామని ఎపీఓ ఎస్ అంజనేయరాజు శుక్రవారం తెలిపారు. ఈ ప్రజావేదిక ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుందని, కార్యక్రమానికి పీడీ జి.జోసఫ్‌కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని 23 పంచాయతీల్లో ఏప్రియల్ -1 2022 నుంచి మార్చి 31 -2023 వరకు ఆయా పంచాయతీల్లో జరిగిన పనులకు తనిఖీలు పూర్తి ప్రజావేదికలో బహిరంగ పరచనున్నట్లు తెలిపారు.

ఎలక్షన్ క్లెయిమ్‌లు త్వరగా పూర్తి చేయండి



బొల్లాపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి.వి.రమణారావు బీఎల్ఓలతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 61 మంది బూత్ లెవెల్ అధికారులకు ఎలక్షన్ క్లెయిమ్‌లు గురించి పలు సూచనలు చేశారు. ఫారం 6, 7లు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రస్తుతం 1200 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, నమోదు, మార్పులు, చేర్పులు దరఖాస్తు దారులను విచారించి, లోపాలు లేకుండా చూడాలని సూచించారు. రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షలో డీటీ వి. సుధాకర్ శర్మ, ఆర్ఐ రామకోటయ్య, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నాదెండ్ల: మండలంలోని తూబాడు గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ డీవీబీ వరకుమార్ శుక్రవారం పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు, ప్రాథమిక పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు పరిశీలించి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని స్థానిక వీఆర్వోలను ఆదేశించారు. ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలను వెంటనే పరిష్కరించాలన్నారు. త్వరలో కొత్త ఓటర్ల జాబితా గ్రామ పంచాయతీలకు అందించనున్నట్లు చెప్పారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సమర్ధవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. పద్దెనిమిదేళ్ల పైబడిన యువతీ యువకులు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆయన వెంట ఆర్ఐ షేక్ రమీజా, వీఆర్వో కోటేశ్వరరావు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

లక్ష్య సాధనలో అలక్ష్యం వహించొద్దు

యడ్లపాడు: క్షేత్రస్థాయిలోనే అన్ని సమస్యల్ని పరిష్కరించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను అమల్లోకి తీసుకువచ్చారని..సర్కారు నిర్దేశించుకున్న గొప్ప లక్ష్య సాధనపై అలక్ష్యం వహించి ప్రజల్ని ఇబ్బంది కలిగించే వారిపై ఇకపై చర్యలు తప్పవని ఎంపీడీవో వై.శ్రీనివాసరావు హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. వివిధ సమస్యలపై వచ్చిన ప్రజల వినతుల్ని సత్వరమే సర్వీస్ ఆన్‌లైన్ చేసి సంబంధిత అధికారి లాగిన్‌కు పంపించాలన్నారు. ఇది సక్రమంగా నిర్వహించడం లేదంటూ ప్రజల నుంచి తనకు ఫిర్యాదు అందాయన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

నాదెండ్ల: అప్పాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని పంట పొలాల్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాటాడుతున్నారన్న సమాచారంతో నాదెండ్ల పోలీసులు దాడి చేశారు. ఎస్సై జె.బలరామ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు పేకాటాడుతున్నారన్న సమాచారంతో దాడి చేయగా, నలుగురు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.6100లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలి

- గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి
- జొన్నలగడ్డ సాంబశివ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



కాలనీలో స్థానికుడికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం జొన్నలగడ్డ గ్రామ శివారు సాంబశివ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా రూ.46లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా పేదలకోసం రూ.2.80 లక్షల కోట్లు నేరుగా వారి ఖాతాలకు జమచేయటంతోపాటు వివిధ పథకాల కింద నాన్ డీబీటి పద్ధతిలో మరో రూ.1.60 లక్షల కోట్లు ఖర్చు చేశారన్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసం నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించారని, ప్రభుత్వ వైద్యశాలలను అభివృద్ధి చేశారన్నారు. నియోజకవర్గంలో గత ఐదేళ్లకాలంలో సుమారు రూ.1360 కోట్ల అభివృద్ధి, సంక్షేమం అందజేశామని చెప్పారు. పట్టణ శివారు కాలనీలను పురపాలక పరిధిలోకి తీసుకొచ్చి మౌలిక వసతులైన రోడ్లు, వీధి దీపాలు, డ్రెయిన్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపట్టామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మోరబోయిన శ్రీనివాసరావు, గ్రామ సర్పంచు కుందా చిన్న, ఉపసర్పంచు శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సోనియా, మాజీ ఎంపీటీసీ దొంతిరెడ్డి శివారెడ్డి, మాజీ సర్పంచు దొండేటి అప్పిరెడ్డి, హాలీవుడ్ రఘు, గాయం రామిరెడ్డి, ఏరువ హనిమిరెడ్డి, ఏరువ చంద్రమౌళి రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులే కీలకం

- డీఈవో వెంకటేశ్వర్లు
- ఘనంగా టెన్త్ విద్యార్థుల వీడ్కోలు సభ



డీఈవోను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

శావల్యాపురం: విద్యార్థులు ఉన్నతికి ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని పల్నాడు జిల్లా డీఈవో మేడా వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో జరుగుతున్న పదోవ తరగతి ఫేర్‌వెల్ సెల్‌బ్రేషన్ కార్యక్రమంలో డీఈవో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పదోవ తరగతి ఫైనల్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకొని గ్రేడులు వారీగా విభజించి సబ్జెక్టు వారీగా బోధించాలన్నారు. అలాగే విద్యార్థుల ప్రవర్తన, క్రమశిక్షణ ప్రగతి తదితరవన్నీ ఉపాధ్యాయులు పరిశీలించాలన్నారు. ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో 9 మంది అర్హత సాధించి జిల్లాలో శావల్యాపురం హైస్కూలు మూడవ స్థానం సాధించటం ఉపాధ్యాయుల బోధన తీరుకు నిదర్శమన్నారు. జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాపోటీల్లో ఇప్పటి వరకు ఆరు మంది బాలికలు ఎంపిక కావటం పలు పాఠశాలలకు ఆదర్శంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం డీఈవోను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బోడ్డపాటి విజయలక్ష్మి, సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు రాగుల రాధాకృష్ణమూర్తి, గురుబాబు, నిర్మల కుమారి, శ్రీనివాసరావు, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

పరీక్షకు 30,169 మంది విద్యార్థులు

ఈ విద్యాసంవత్సరంలో పల్నాడు జిల్లాలో 30 వేల 169 మంది విద్యార్థులు ఫైనల్ పరీక్షలు 127 పరీక్ష కేంద్రాల్లో రాయనున్నట్లు డీఈవో తెలిపారు. ఇందుకుగాను ఈ నెల 20న జిల్లాస్థాయిలో జిల్లా కలెక్టరు సారథ్యంలో పదోవ తరగతి ఫైనల్ పరీక్షలు నిర్వహణ విధివిధానాలపై ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. 3 నుంచి 9వ తరగతి వరకు ఆంగ్ల భాషల్లో విద్యార్థులు మంచి పట్టు సాధించేలా ప్రభుత్వం నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ఇటీవల జరిగిన ఆడుదాం -ఆంధ్రా కార్యక్రమంలో మంచి ప్రతిభను పాఠశాల విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలన

వినుకొండ (నూజెండ్ల): రవ్వవరం గ్రామంలో కొండ గురునాథస్వామి తిరునాళ్ల ఈ నెల 24వ తేదీన జరుగుతున్న సందర్భంగా పుచ్చనూతల పంచాయతీ పరిధిలోని ఐనవోలు ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ విద్యుత్ ప్రభలు నిర్మించుకునే వారు ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. భక్తుల సౌకర్యార్థం కొండమీద, కొండ కింద ప్రాంతంలో తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ప్రతిఒక్కరూ ప్రశాంతమైన వాతావరణంలో తిరునాళ్లను జరుపుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏఎస్ఐ కోటిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పేర్లను నమోదు చేసుకోవాలి

నరసరావుపేట: పురపాలక పరిధిలో మల, మురుగు శుభ్రపర్చటంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొంటున్న కార్మికులు, సెప్టిక్ ట్యాంకు డ్రైవర్లు, హెల్పర్లు తమ పేర్లను నమస్తే పథకంలో స్వచ్ఛంధగా నమోదు చేసుకోవాలని కమిషనర్ ఎం.రామ్మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. భారత ప్రభుత్వం, గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టమ్(నమస్తే) పథకాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందన్నారు. ఆధార్, ఓటరు ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, రేషన్‌కార్డు, కుల ధృవీకరణపత్రాలలో ఏదో ఒకటి, బ్యాంకు వివరాల నకలును మున్సిపల్ శానిటేషన్ విభాగంలో అందజేయాలని కోరారు.

పెయింటర్ ఆత్మహత్య

నరసరావుపేట టౌన్: పెయింటర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివసంజీవయ్య కాలనీకి చెందిన చింతగుంట్ల యోహాన్ (35) 15 సంవత్సరాల క్రితం షేక్ జేబున్‌ను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. గత కొన్నేళ్లుగా మద్యానికి బానిసై పనికి సరిగ్గా వెళ్లటంలేదు. ఈ క్రమంలో భార్య, భర్తల మధ్య విబేధాలు తలెత్తాయి. శివ సంజీవయ్య కాలనీ వెనుక భాగంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో టూటౌన్ సీఐ భాస్కర్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదం కేసులో ఏడాది జైలు

నరసరావుపేట టౌన్: నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఓ వ్యక్తి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.16 వేల రూపాయలు జరిమానా విధిస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి టి. ప్రవల్లిక శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. లక్ష్మీపురం గ్రామం వద్ద 2015 ఏప్రియల్ 11న ఆగి ఉన్న లారీను వేగంగా వచ్చిన మరో లారీ ఢీకొంది. ఈ సంఘటనలో కట్ట వెంకయ్య మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడు లారీ డ్రైవర్ బి.రాంబాబుపై నరసరావుపేట రూరల్ పోలీసులు అభియోగ పత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

గరికపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

- 404 మందికి వైద్య చికిత్సలు
- 89 మందికి కంటి వైద్య సేవలు
- ఉచితంగా మందులు పంపిణీ



శిబిరంలో వైద్యసేవలు అందజేస్తున్న వైద్య సిబ్బంది

బొల్లాపల్లి: మండలంలోని గరికపాడు గ్రామ యూపీ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. వైద్య సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బొల్లాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పి.శంకర నారాయణ ప్రత్యేక వైద్యనిపుణులు కె.ఎల్.ఎన్. రావు, కె.ఎస్.సస్రంతి, కంటి వైద్యులు ఎస్‌కె చాంద్ బాషాలు వైద్యచికిత్సలు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో 404 మందికి వైద్య చికిత్సలు అందజేసి ఉచితంగా మందులు పంపిణీ చేశామని, వీరిలో 89 మందికి కంటి వైద్య సేవలు పొందారని ఈ మేరకు వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎం.కొండలు, పీహెచ్‌సీ సీహెచ్ఓ కె మల్లయ్య, వైద్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు ముందస్తు పరిశీలన

డీఎస్పీ సత్యనారాయణ శర్మ



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ

వినుకొండ (నూజెండ్ల): రానున్న అసెంబ్లీ ఎన్నికల ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టినట్లు నరసరావుపేట డీఎస్పీ వత్సవాయి సత్యనారాయణ శర్మ అన్నారు. శుక్రవారం శావల్యాపురం, వినుకొండ రూరల్, పట్టణ పోలీసు స్టేషన్లను సందర్శించారు. వినుకొండ స్టేషనులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలు, జిల్లా ఎస్పీ ఆదేశాలు మేరకు ఎన్నికల సజావుగా జరిగేలా పోలీసు అధికారులను సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నామన్నారు. అక్రమంగా నగదు, మద్యం సీసాలు రవాణా చేస్తున్న అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. వాహనాల తనిఖీల్లో ఎలాంటి మద్యం సీసాలు రవాణా చేసిన సరైనా ఆధారాలు లేకుండా నగదు పట్టుబడిన సీజ్ చేసి అటువంటి వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామన్నారు. వినుకొండ రూరల్ పరిధిలో చీకటీగలపాలెం, బొల్లాపల్లి మండలం గుట్లపల్లి వద్ద పోలీసు చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. రౌడీ షీటర్ల ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి గొడవలు, అల్లర్లకు తావులేకుండా సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుపికెట్ ఉంచామన్నారు. ముందుస్తుగా ఇరుపార్టీల నాయకులపై బైండవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఎన్నికల ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా ప్రజలందరూ పోలీసులకు సహకరించాలన్నారు. పటిష్ఠమైన బందోబస్తు నడుమ ఎన్నికల జరుగుతాయన్నారు. అనంతరం ఆయా స్టేషన్లు పరిసరాల పరిశీలించారు. ఆయనతో పాటు సీఐలు ఉప్పుటూరి సుధాకర్, సాంబశివరావు, ఎస్సైలు చల్లా సురేష్, కత్తి స్వర్ణలత, కృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు



సుదర్శన మహాయాగం నిర్వహిస్తున్న అర్చకులు

నరసరావుపేట ఈస్ట్: రథసప్తమి పర్వదినాన్ని శుక్రవారం పట్టణంలో వైభవంగా నిర్వహించారు. వివిధ ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. సూర్యుడు తన రథాన్ని అధిరోహించి లోకాలకు వెలుగు అందించటాన్ని పురస్కరించుకుని జరుపుకునే రథసప్తమిని ఆలయాలలో వైభవంగా జరుపుకున్నారు. సత్తెనపల్లిరోడ్డులోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయ సముదాయంలోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం శ్రీలక్ష్మీ నారసింహ సహిత ధనశ్రీ సుదర్శన మహాయాగం, ఆదిత్య హృదయ పారాయణం నిర్వహించారు. సాయంత్రం శ్రీనివాస కల్యాణం కన్నుల పండువగా కొనసాగింది. ఉభయ దేవేరులతో శ్రీవారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అలంకరించి అర్చకస్వాములు కళ్యాణోత్సవం జరిపారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

హిందూ పరివార్ ఆధ్వర్యంలో....

హిందూ పరివార్ సంస్థ ఆధ్వర్యంలో రథసప్తమిని పురస్కరించుకుని శ్రీసరస్వతి శిశుమందిర్ ఆవరణలో నవగ్రహ, మహా మృత్యుంజయ, శ్రీసూర్య హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. హిందూ పరివార్ కన్వీనర్ కొత్తూరి వెంకట నరసింహారావు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రంగిసెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వినుకొండలో..

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని శ్రీనివాసనగర్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి సుప్రభాత సేవతో పాటు ప్రత్యేక అలంకరణలు పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులను రథంపై మహిళా భక్తుల కోలాటం, బాజాభజంత్రీల మధ్య వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

సచివాలయ వ్యవస్థతో పాలనలో నూతన ఒరవడి

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- పెదకంచర్లలో గ్రామసచివాలయం ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): సచివాలయ వ్యవస్థ ద్వారా నూతన పాలనకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండ మండలం పెదకంచర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసంగిస్తూ ఎన్నో ఏళ్లుగా పెదకంచర్ల గ్రామంలో రోడ్డు సదుపాయం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కాని ఇప్పుడు మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే గోనుగుంట్లవారిపాలెం నుంచి పెదకంచర్ల గ్రామ వరకు రోడ్ల నిర్మాణం చేశామని తెలిపారు. రోడ్ల నిర్మాణంతో పాటు పలుప్రాంతాల్లో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయినేజీలను కూడా నిర్మించామని తెలిపారు. ఎస్సీ కాలనీ వాసులకు శ్మశాన వాటిక లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని శ్మశానానికి 3 ఎకరాల భూమి కేటాయించామని తెలిపారు. ప్రతిగ్రామంలో సచివాలయ భవనాలను పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టి పేదప్రజలకు అతిచేరువలో సేవలు అందిస్తున్నారని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా 1.35 లక్షల మంది సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించారని అన్నారు. సచివాలయ వ్యవస్థకు ప్రజలకు మధ్య వారధిగా వలంటీర్లను ఏర్పాటు చేసి ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యే విధంగా ఈ వ్యవస్థను తీర్చిదిద్దారన్నారు. గత ప్రభుత్వాల్లో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రభుత్వ హయాంలో మెరుగైన సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని కొనియాడారు. పేదల పక్షపాతిగా వారి అభ్యున్నతికి ఈ ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. గతంలో వైఎస్సార్ పాలనలో సంక్షేమం, అభివృద్ధి జరిగిందని, నేడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో సంక్షేమం వర్ధిల్లుతుందని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు ఈ ప్రభుత్వ హయాంలో అందాయన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో వినుకొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లామన్నారు.

కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లుయాదవ్, ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ విజయలక్ష్మిరాజా, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండు చెన్నయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి



పథకం గురించి వివరిస్తున్న కమిషనర్ సీహెచ్ గోవిందరావు

చిలకలూరిపేట: సఫాయి కార్మికులు తమ పేర్లను నమస్తే యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు కోరారు. సెప్టిక్ ట్యాంకర్ల డ్రైవర్లు, సహాయకుల సంక్షేమం కోసం పురపాలక సంఘ కార్యాలయంలో నమస్తే పథకంపై సఫాయి కార్మికుల వివరాల నమోదు శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మల, మురుగు తొలగింపు పనిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొనే కార్మికులు నమస్తే యాప్‌లో నమోదు కావడం వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. నమస్తే యాప్‌లో రిజిస్టర్ చేయించుకోవడం వలన ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే రూ.30 లక్షల వరకు బీమా వర్తిస్తుందని తెలిపారు. అదే విధంగా అవసరమైన పీపీఈ కిట్లు వంటి సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు షేక్ ఇస్మాయిల్, ఎ.శ్రీనివాసరావు, వార్డు శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

శావల్యాపురంలో ఉత్తమ వలంటీర్లకు...

శావల్యాపురం: వలంటీర్లు అభినందన కార్యక్రమంలో భాగంగా మండలంలోని 202 వలంటీర్లు ఉండగా సేవా వజ్రాలు ఇద్దరు, సేవా రత్నాలు ఐదు మంది,సేవా మిత్రలు 195 మంది ఎంపికైనట్లు ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి శుక్రవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ సేవా వజ్రాలుగా మండలంలోని పోట్లూరు గ్రామసచివాలయ పరిధిలో పోట్లూరి సుకన్య, కారుమంచి గ్రామసచివాలయ పరిధిలో ఏలికా నాగేశ్వరరావులు ఎంపిక కాగా వీరికి ఒక్కొక్కరికీ రూ. 45 వేలు ప్రభుత్వం బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తుందన్నారు. సేవా రత్నల్లో భాగంగా మండలంలోని వేల్పూరు-2 గ్రామసచివాలయ పరిధిలో చాపల బ్రహ్మయ్య, పోట్లూరు గ్రామసచివాలయ పరిధిలో దివ్యకోలు రజని, గుంటుపాలెం గ్రామసచివాలయ పరిధిలో మంగమూరి ప్రమీల, కనమర్లపూడి గ్రామసచివాలయ పరిధిలో దేవరపల్లి శ్రీనివాసరావు, కారుమంచి గ్రామ సచివాలయ పరిధిలో గొడుగులూరి సుజాత ఎంపిక కాగా ఒక్కొక్కరికీ రూ.30 వేలు నగదు బ్యాంకు ఖాతాల్లో నేరుగా ప్రభుత్వం నగదు జమ చేస్తుందన్నారు. మిగిలిన 195 మందికి ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున వారం రోజుల పాటు వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. కార్యాలయ సిబ్బంది కారుచోలు భారతి ఉన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా విద్యార్థి విభాగ కమిటీ మెంబర్లు వీరే

జిల్లా అధ్యక్షులుగా సయ్యద్ సిరాజ్ నియామకం

నరసరావుపేట: పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా విద్యార్థి విభాగ కమిటీని కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ప్రకటించింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షులుగా చిలకలూరిపేటకు చెందిన సయ్యద్ సిరాజ్, ఉపాధ్యక్షులుగా షేక్ మాబు సుభాని (సత్తెనపల్లి), యు.వేణుమాధవ్ (నరసరావుపేట), ప్రధాన కార్యదర్శులుగా హేమంత్ (చిలకలూరిపేట), కొండూరు శివకుమార్ (సత్తెనపల్లి), సీహెచ్.గణేష్ (మాచర్ల), బి.షషాంక్(పెదకూరపాడు), బూదాల కల్యాణ్ (నరసరావుపేట), షేక్ ఫిరోజ్‌బాబు (గురజాల), కార్యదర్శులుగా మంజునాథ్ రెడ్డి, కొణతం మనోహర్ (చిలకలూరిపేట), మాచా శ్రీనివాసులు, ఎస్. వేదా శీర్షా (సత్తెనపల్లి), ఎం.నాగేంద్రబాబు, ఎం.నాగలింగం (మాచర్ల), బి.సతీష్, షేక్ హఫీజ్ (పెదకూరపాడు), షేక్ ఖాసింషరీఫ్ (నరసరావుపేట), ఐ.బాలాజీ (గురజాల), సంయుక్త కార్యదర్శులుగా శీలం ఓవైసీ, ఏ కార్తీక్ (చిలకలూరిపేట), కలేకురి యోగనాథ్, షేక్ జంషెడ్ బాష (సత్తెనపల్లి), యటికాల శ్రీనివాసరావు, కొర్రా మాణిక్యరావు (మాచర్ల), వజ్రాల శ్రీనివాసరెడ్డి, షారూక్‌ఖాన్ (పెదకూరపాడు), షేక్ లుక్‌మాన్, కోటిరెడ్డి (నరసరావుపేట), మహమద్ మజీద్, ఎం.వెంకట నరేంద్ర (గురజాల) నియమితులయ్యారు.

అనుబంధ విభాగాల్లో జిల్లా నాయకులు వీరే

రాష్ట్ర ఎస్టీసెల్ ప్రధాన కార్యదర్శిగా పాలపర్తి



నరసరావుపేట: పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురు నాయకులను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఎస్టీసెల్ కమిటీలో జిల్లాకు చెందిన పాలపర్తి వెంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శిగాను, కార్యదర్శిగా భాణవత్ నాగేశ్వరనాయక్, సంయుక్త కార్యదర్శిగా ముడావత్ రామకృష్ణనాయక్‌లను నియమించారు. అలాగే రాష్ట్ర వైఎస్సార్ సేవాదళ్ కమిటీలో సంయుక్త కార్యదర్శిగా ఎ.వెంకటశివ, రాష్ట్ర లీగల్ సెల్ కమిటీలో కార్యదర్శిగా కర్నాటి చెన్నకేశవరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా చిన్నమ్ మణిబాబు నియమితులయ్యారు.

విద్యాశాఖ ఆర్జేడీ పర్యటన

నాదెండ్ల: మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, నాదెండ్ల జెడ్పీ హైస్కూల్‌ను ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యాశాఖ ఆర్జేడీ లింగేశ్వర రెడ్డి తనిఖీ చేశారు. పాఠశాలలో 8,9,10 విద్యార్థులకు ట్యాబ్‌లు ఎంతవరకు వినియోగిస్తున్నారనే దానిపై విచారణ చేశారు. పదో తరగతి విద్యార్థులు తరగతి గదుల్ని పరిశీలించారు. టోఫెల్ విద్యావిధానంపై కాంప్లెక్స్ నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు, టీచింగ్ టూల్స్ అంశాలపై పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మెరుగైన సౌకర్యాలను విద్యార్థులు ఎంతమేర సద్వినియోగం చేసుకుంటున్నారనే విషయాలపై ఆరా తీశారు.

అనిల్‌కు సీటు ఇవ్వడం అభినందనీయం



నరసరావుపేట: బడుగు, బలహీన. వెనుకబడిన వర్గానికి చెందిన డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి అభినందనీయుడని ఏపీ వెనుకబడిన తరగతుల సేవా సంఘం నాయకులు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం రావిపాడు రోడ్డులోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు బత్తుల వెంకటేష్ ఆధ్వర్యంలో కమిటీ సమావేశం నిర్వహించారు. వెంకటేష్ మాట్లాడుతూ అనిల్‌కుమార్ యాదవ్‌కు పార్లమెంటు నియోజకవర్గంలో ఉన్న అన్ని బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ మేరకు అనిల్‌కుమార్‌ను కార్యాలయంలో కలిసి అభినందనలు తెలియచేశామన్నారు. సమావేశంలో బొందిలి శ్రీనివాస్ సింగ్, లటికే రాంబాబు, పొనుగోటి ఆంజనేయులు, గాడిల్లి సాంబశివరావు, చిందు నాగేశ్వరావు, పీర్ ఖాసీం పాల్గొన్నారు.